నమస్తే తెలంగాణ

జోగుళాంబ గద్వాల వనపర్తి

5 మహబూబ్‌నగర్, గురువారం 28 మార్చి 2024 JOGULAMBA GADWAL WANAPARTHY



బిజినేపల్లి మండలంలోని మమ్మాయిపల్లి ఫారెస్టు

# మూగజీవుల అరణ్యరోదన

- అటవీ ప్రాంతంలో ఎండిపోయిన నీటి సాసర్‌పిట్లు
- నాగర్‌కర్నూల్ రేంజ్ పరిధిలో తాగునీటి కటకట
- దాహం కోసం పొలాల్లోకి వస్తున్న జంతువులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

బిజినేపల్లి, మార్చి 27 : నాగర్‌కర్నూల్ రేంజ్ పరిధిలోని బిజినేపల్లి మండలం మమ్మాయిపల్లి, గంగారం, లట్టుపల్లి గ్రామాలను కలుపుకొని వేల ఎకరాల్లో అడవి విస్తరించి ఉన్నది. ఈ అడవిలో ఎన్నోరకాల జంతువులు జీవిస్తున్నాయి. వేసవిలో తాగడానికి నీరులేక సమీప పొలాల్లోకి వెళ్లి దాహం తీర్చుకుంటున్నాయి. గతంలో అటవీశాఖాధికారులు దాదాపు 23 ప్రాంతాల్లో జంతువులకు నీటిని అందించేందుకు సాసర్‌పిట్లను నిర్మించారు. వాటిని నీటితో నింపకపోవడంతో చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ అడవిలో ఎన్నో రకాల పండ్లను ఇచ్చే మొక్కలు ఉన్నాయి. కేసీఆర్ సర్కారు హయాంలో మొక్కలను పెంచేందుకు ప్లాంటేషన్ ఏర్పాటు చేసి రకరకాల మొక్కలను నాటారు. వీటితోపాటు ఫారెస్టులో ఉన్న రహదారి పొడవునా మొక్కలను నాటారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం అటవీ ప్రాంతంలో నాటిన మొక్కలకు నీటిని అందించకపోవడంతో ఎండుమొఖం పట్టాయి. ఫారెస్టులోని జింకలు, నెమళ్లు, వివిధ రకాల పక్షులు, జంతువులు తాగునీటి సౌకర్యం లేక అడవి సమీపంలోని పొలాలకు వస్తున్నాయి. అటవీ ప్రాంతంలో చిన్నపాటి కుంట ఉండడంతో అక్కడే దాహం తీర్చుకుంటున్నాయి. మిగతా ప్రాంతాల్లో నీటి సౌకర్యం లేక దాహంతో అలమటిస్తున్నాయి. దీంతోపాటు అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సోలార్ బోరు నిర్వహణ లేకపోవడంతో మరుగున పడింది. స్థానిక అటవీశాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో జంతువులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అటవీ జంతువుల కోసం నీటి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### సోలార్ బోర్ల ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తున్నాం..

అటవీ ప్రాంతంలో మూడు సోలార్ బోర్ల ద్వారా గుంతలను ఏర్పాటు చేసి జంతువులకు తాగునీటి కోసం నీటిని నింపుతున్నాం. సాసర్లలో నీటిని నింపనిమాట వాస్తవమే. సోలార్ బోర్ల ద్వారా మూడు ప్రాంతాల్లో గుంతలు తవ్వి నీటి సౌకర్యం కల్పిస్తున్నాం. – ఫర్వేజ్ అహ్మద్, నాగర్‌కర్నూల్ రేయింజ్ అధికారి



మమ్మాయిపల్లి ఫారెస్టులో నీరులేక చెత్తతో నిండిపోయిన సాసర్

# దేవరకద్ర మార్కెట్‌కు పోటెత్తిన ఉల్లి

- క్వింటాల్ గరిష్ఠంగా రూ.1,400
- కరిష్ఠంగా రూ.900

దేవరకద్ర, మార్చి 27 : దేవరకద్ర మార్కెట్‌కు రైతులు ఉల్లిగడ్డను బుధవారం అత్యధికంగా తీసుకొచ్చారు. గతేడాది దిగుబడి లేక రూ.3వేల మార్క్ దాటిన ఉల్లి ధరలు ఈ ఏడాది దిగుబడులు పెరగడంతో సగం ధరకు పడిపోయాయి. కూలి, రవాణా, పెట్టుబడి పోనూ రైతులకు నష్టాలు ఎదురవుతున్నాయి. దాదాపు 10వేల క్వింటాళ్లకు పైగా ఉల్లి విక్రయానికి వచ్చినట్లు మార్కెట్ కమిటీ సభ్యులు తెలిపారు. క్వింటాల్ గరిష్ఠంగా రూ.1,400 ధర పలుకగా, కనిష్ఠంగా రూ.900ల వరకు పలికింది. గత వారంతో పోల్చితే రూ.100 ధర తగ్గింది.

### వేరుశనగ @ రూ.7,036

జడ్చర్ల, మార్చి 27 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుశనగకు అత్యధికంగా క్వింటా రూ.7,036 ధర పలికింది. మార్కెట్‌కు 745 క్వింటాళ్ల వేరుశనగ రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.7,036, కనిష్ఠంగా రూ.4,650, మధ్యస్తంగా రూ.6,395 ధర పలికింది. ఉలువలు క్వింటాకు రూ.6,819, ఆముదాలు క్వింటాకు రూ.5,859, పెసర్లు క్వింటాకు గరిష్ఠంగా రూ.3,819, జొన్నలు క్వింటాకు గరిష్ఠంగా రూ.5,090, పత్తి క్వింటాకు గరిష్ఠంగా రూ.7,111, మొక్కజొన్న క్వింటాకు గరిష్ఠంగా రూ.2,231 ధర పలికినట్లు బాదేపల్లి మార్కెట్ అధికారులు తెలిపారు.



దేవరకద్ర మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన ఉల్లి

# ప్రమాదమని తెలిసినా..!



పుట్ బోర్డు ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా తప్పని పరిస్థితుల్లో విద్యార్థులు వేలాడుతూ వెళ్తున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని గొప్పలు చెబుతున్న ఆర్టీసీ సంస్థ గ్రామీణ ప్రాంతాలకు సరిగా బస్సులు నడిపించకపోవడంతో విద్యార్థులు పుట్‌బోర్డుపై వేలాడుతూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మహబూబ్‌నగర్ నుంచి ఖిల్లాఘణపురం మీదుగా వనపర్తి వెళ్లే బస్సు కిక్కిరిసి రావడంతో దొంతికుంట వద్ద దాదాపు 10 మంది విద్యార్థులు బస్సు పుట్‌బోర్డు వద్ద వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణించడాన్ని 'నమస్తే



తెలంగాణ' తన కెమెరాలో బంధించింది.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నమస్తేతెలంగాణ, మహబూబ్‌నగర్, మార్చి 27

# వరకట్న వేధింపు కేసులో పదేండ్ల జైలుశిక్ష

మక్తల్ టౌన్, మార్చి 27 : వరకట్నం వేధింపులకు పాల్పడిన నిందితుడికి నారాయణపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ పదేండ్ల జైలుశిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధించారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మక్తల్ మండలం భూత్పూర్‌కు చెందిన దళితుడు నరసింహ భూత్పూర్ గ్రామానికి చెందిన నర్సమ్మను 2019లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. 26–10–2020 తేదీన భార్య నర్సమ్మ కనిపించడం లేదని భర్త నర్సింహులు అత్తకు సమాచారం అందించాడు. ఎక్కడ వెతికినా కనిపించకపోవడంతో నర్సమ్మ తల్లి మీసాల భీములమ్మ నర్సింహులుపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అదనపు కట్నం కోసం అత్తామామ, భర్త కలిసి నర్సమ్మను హత్య చేసి భూత్పూర్ రిజర్వాయర్‌లో పడేసినట్లు ఒప్పుకొన్నారు. దీంతో 16 మంది సాక్షులను విచారించి నేరస్తులపై పోలీసులు చార్జిషీటు దాఖలు చేయగా, బుధవారం నేరస్తుడికి న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ పదేండ్ల జైలు శిక్షతోపాటు రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నేరస్తుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# సర్వం సిద్ధం

- నేడే ఎమ్మెల్సీ ఉపపోరు
- 10 కేంద్రాలు, 1,439 ఓటర్లు
- ఉమ్మడి జిల్లాలో పది చోట్ల పోలింగ్‌కు ఏర్పాట్లు
- భద్రత మధ్య బ్యాలెట్ బాక్సులు, సామగ్రి తరలింపు
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌తోపాటు ముగ్గురు పోటీ
- శిబిరాల్లోనే ప్రజాప్రతినిధులు
- నేరుగా పోలింగ్ కేంద్రాలకు తరలింపు
- ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన అబ్జర్వర్
- ఏప్రిల్ 2న కౌంటింగ్



పోలింగ్ డిస్ట్రిబ్యూషన్‌ను పరిశీలిస్తున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్, మార్చి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : శాసనమండలి ఉప ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. గురువారం ఉమ్మడి జిల్లాలోని ఆయా జిల్లాల పరిధిలో పది చోట్ల ఓటు వేసేందుకు అధికారులు ఇప్పటికే కేంద్రాలను ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 1,439 మంది స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఈ ఉప ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. బీఆర్ఎస్ నుంచి మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి జీవన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్ బరిలో ఉన్నారు. ఉప ఎన్నిక సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. బుధవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో పోలింగ్ సామగ్రిని, బ్యాలెట్ బాక్సులను సిబ్బంది భారీ బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఉప ఎనికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఎన్నికల పరిశీలకురాలు వాణి ప్రసాద్ పరిశీలించారు. మైక్రో అబ్జర్వర్లతో సమావేశమై నిర్వహించాల్సిన విధులను వివరించారు. అంతకుముందు కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవినాయక్ పోలింగ్ డిస్ట్రిబ్యూషన్‌ను పరిశీలించారు. బ్యాలెట్ పద్ధతిన ఓటింగ్ నిర్వహిస్తుండడంతో పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డ్ చేయనున్నారు. ఎన్నికల ప్రక్రియను కంట్రోల్ రూంలో నుంచి పర్యవేక్షిస్తారు. ఓటింగ్‌లో పాల్గొనాల్సిన స్థానిక ప్రజాప్రతినిధులను రెండు పార్టీల ప్రతినిధులు శిబిరాలకు తరలించారు. వారంతా నేరుగా ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాటు చేస్తున్నాయి. రెండు పార్టీల్లో క్రాస్ ఓటింగ్ భయం నెలకొంది. ఇటీవల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమై ఎమ్మెల్సీ ఎన్నికల్లో తప్పక విజయం సాధించాలని క్యాడర్‌ను కోరారు.

**పది కేంద్రాలు..1,439 మంది ఓటర్లు..**

శాసన మండలి ఎన్నిక తుది ఘట్టానికి చేరుకున్నది. ఎన్నికల కోసం మొత్తం 10 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1,439 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బ్యాలెట్ పద్ధతిన ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ మేరకు అభ్యర్థులు ప్రాధాన్యత క్రమంలో అభ్యర్థులకు మొదటి, రెండో ప్రాధాన్యత ఓట్లు వేయాల్సి ఉంటుంది. 2021లో జరిగిన శాసన మండలి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎనికయ్యారు. ఆ తర్వాత గెలిచిన కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, కొడంగల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, కొల్లాపూర్, అచ్చంపేట, షాద్‌నగర్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్‌లో ఆయా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. 1,439 మంది ఓటు హక్కు కలిగిన వారిలో 19 మంది ఎక్స్ అఫీషియో సభ్యులున్నారు. వారిలో 17 మంది పురుషులు, ఇద్దరు మహిళలు, ఎంపీటీసీల్లో 888 మంది ఉండగా, 386 మంది పురుషులు, 502 మంది మహిళలు, జెడ్పీటీసీల్లో 83 మందిలో 36 మంది పురుషులు, 47 మంది మహిళలు, కౌన్సిలర్లలో 449 మందిలో 205 మంది పురుషులు, 244 మంది మహిళలుఉన్నారు. వీరంతా తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

**పోలింగ్‌కు భారీ బందోబస్తు..**

శాసన మండలి ఉపఎన్నికల పోలింగ్ కోసం భారీ పోలీసు బందోబస్తును నిర్వహిస్తున్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు ఉన్నతాధికారులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయా జిల్లాల ఎస్పీలు ప్రకటించారు. జోగులాంబ జోన్ ఐజీ ఆధ్వర్యంలో పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులతోపాటు సిబ్బందిని బందోబస్తు మధ్య తరలించారు. పోలింగ్ ప్రక్రియ అంతా నిఘా నీడలోనే సాగేలా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ముగిశాక బ్యాలెట్ బాక్సులను ఉమ్మడి జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూంకు తరలిస్తారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాలలో ఏప్రిల్ 2న కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచే స్ట్రాంగ్ రూంతోపాటు ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### ఉత్కంఠ రేపుతున్న ఉప ఎన్నిక..

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఉత్కంఠ రేపుతున్నది. శాసన మండలి ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికల కన్నా ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఇరు పార్టీలు స్థానిక ప్రజప్రతినిధులను తమవైపునకు లాక్కునేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. కాంగ్రెస్‌కు సంఖ్యాబలం లేనప్పటికీ ఆ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి సై అంటూ పెద్ద ఎత్తున ప్రలోభాలకు తెరలేపింది. గెలుపుకోసం అధికార పార్టీ కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధమయిందనే విమర్శలు వస్తున్నాయి. కొందరు కుటుంబ సమేతంగా శిబిరాల్లోనే ఉన్నారు. నేరుగా వారిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి.



పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి బ్యాలెట్ బాక్సులతో బయలుదేరుతున్న ఎన్నికల సిబ్బంది



బ్యాలెట్ బాక్సులతో పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో బయలుదేరుతున్న ఎన్నికల సిబ్బంది

# ఆక్వా ఫోనిక్స్ విధానంతో అధిక లాభాలు

పెబ్బేరు, మార్చి 27 : ఆక్వా ఫోనిక్స్ విధానంలో చేపలు, మొక్కల పెంపకంతో అధిక లాభాలు ఆర్జించవచ్చని పెబ్బేరు మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నాగలక్ష్మి అన్నారు. నేషనల్ మీట్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో బుధవారం కళాశాలలో ఆక్వా ఫోనిక్స్ విధానంపై ఎస్సీ రైతులకు ఒక రోజు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానికనుగుణంగా వ్యవసాయ పద్ధతులను అవలంభించాలన్నారు. తక్కువ స్థలం, తక్కువ నీటితో ఎక్కువ లాభం వచ్చే విధానాలలో ఆక్వా ఫోనిక్ ఒకటని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాయిస్ ఫాతిమా, వ్యవసాయాధికారి చంద్రమౌళి, సిబ్బంది భానుప్రకాశ్, హారిక, రామకృష్ణారెడ్డి, ఓబులేసు ఉన్నారు.



శిక్షణ పొందిన వారితో డాక్టర్ నాగలక్ష్మి, కళాశాల అధ్యాపకులు

# రూ.9,69,750 సీజ్

- 1,082 లీటర్ల మద్యం సీజ్
- 94 మంది బైండోవర్
- 23 ఆయుధాలు స్వాధీనం

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 27 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం భారీగా నగదు, మద్యం పట్టుకున్నట్లు నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ చెక్‌పోస్టలలో చేసిన తనిఖీల్లో రూ.9, 69,750లతో పాటు 1078 లీటర్ల మద్యం, నాటుసారా, 23 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు 94 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.

# నత్తే.. నయం..!

- సా..గుతున్న గట్టు ఎత్తిపోతల పనులు
- బిల్లుల చెల్లింపులో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం
- నిర్వహణ భారంతో క్యాంప్‌లో నిలిచిన వాహనాలు
- చేస్తున్నామని చెప్పుకోవడానికి అరకొర పనులు
- మరో రెండేండ్లైనా పనులు పూర్తవ్వడం కష్టమే..

గద్వాల, మార్చి 27 : కృష్ణానది జలాలతో గట్టు, కేటీదొడ్డి మండలాల్లోని బీడు భూములకు సాగునీటిని అందించే గట్టు ఎత్తి పోతల పథకం పనులు చూసి నత్త కూడా నవ్వుతోంది. ఎన్నాళ్లుగానో ఊరిస్తున్న గట్టు ఎత్తిపోతల పథకం త్వరలో కార్యరూపం దాల్చుతుందన్న గట్టు, కేటీదొడ్డి రైతుల ఆశలు అడి ఆశలుగా మారుతున్నాయి. గట్టు ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి నెట్టెంపాడు ద్వారా సాగునీటికి నోచుకోని ప్రాంతాలైన గట్టు, ఆలూరు, తుమ్మలచెర్వు, రాయపురం, జోగన్‌గట్టు, మల్లాపురం, మల్లాపురంతండా, కుచినెర్ల, చింతలకుంట, తారపురం, సోంపురం, మాచర్ల, ఎల్లందొడ్డి తదితర గ్రామాలతోపాటు కేటీదొడ్డి మండలాల్లోని కొన్ని గ్రామాలకు సాగునీరు అందించాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. అయితే ఈ పనులు ప్రస్తుతం నత్తనడకన సాగుతుండడంతో మరో రెండు సంవత్సరాలైనా పనులు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. తుమ్మలచెర్వు సమీపంలో ర్యాలం పాడు రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకొని గట్టు మండలం రాయపురం సమీపంలో గజ్జలమ్మ గట్టు వద్ద 1.320 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టి దీని ద్వారా గట్టు, కేటీదొడ్డి మండలాల్లోని 33వేల ఎకరాలకు సాగు నీరు అందించడంతోపాటు ఈ మండలాల్లో 44 చెరువులతోపాటు కుంటలను నీటితో నింపి డిస్ట్రిబ్యూటరీల ద్వారా పొలాలకు సాగునీటిని అందించడానికి దీనిని నిర్మించారు. నెట్టెంపాడు ద్వారా నీరు అందని గట్టు, కేటీదొడ్డిలోని అన్ని గ్రామాలకు గట్టు ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు అందించి ఈ ప్రాంతాలను సస్యశ్యామలం చేయడానికి కేసీఆర్ ప్రభుత్వం ప్రయత్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు పడకేసేలా చేసింది.

**ఎత్తిపోతల స్వరూపం ఇదీ..**

ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి అప్రోచ్ కెనాల్ ద్వారా మూడు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసే పంప్‌హౌస్‌కు నీటిని పంపిస్తారు. పంప్‌హౌస్ నుంచి 12మెగావాట్ల(ఎండబ్ల్యూ) సామర్థ్యం కలిగిన రెండు మోటర్ల ద్వారా మూడు మీటర్ల వ్యాసం కలిగిన పైప్‌లైన్ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలోని గజ్జలమ్మ గట్టు రిజర్వాయర్‌లోకి నీటిని తోడిపోస్తారు. 50రోజులపాటు ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి గట్టు ఎత్తిపోతల పథకానికి నీటిని ఎత్తిపోయనున్నారు. రిజర్వాయర్ దగ్గర నుంచి ఏర్పాటు చేసే కుడి కాల్వను 18కి.మీ., ఎడమ కాల్వ 15కి.మీ పొడవున తవ్వి నీటిని కాల్వల ద్వారా తరలించి 33వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. దీంతోపాటు ఆయా మండలాల్లో ఉన్న 44 చెరువులు నింపనున్నారు.

**బిల్లుల చెల్లింపులో జాప్యం వల్లే..**

బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా గట్టు ఎత్తిపోతల పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ.586 కోట్లతో గట్టు ఎత్తిపోతల పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్ ఒప్పందం చేసుకున్నారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఈ ప్రభావం గట్టు ఎత్తిపోతల పనులపై పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రాజెక్టులకు నిధులను విడుదల చేయడంలో జాప్యం జరుగుతుండడంతో పనులు అనుకున్న స్థాయిలో ముందుకుసాగడం లేదు. వాస్తవంగా పనులు ప్రారంభమైన నాటి నుంచి రెండు ఏండ్లలో ప్రాజెక్టు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకరావాలనేది ఒప్పందం. అయితే పనులు ప్రారంభమై ఇప్పటికే ఏడాది పూర్తైంది. ఈ ఏడాది కాలంలో కేవలం 40శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు. అక్టోబర్ నెల నుంచి పనులు ఓ మాదిరిగా సాగుతున్నాయి. ప్రస్తుతం వాహనాలకు డీజిల్ పోయించడానికి నిధులు లేక పోవడంతో పనుల దగ్గర వాహనాలు ఎక్కడికక్కడ కాంట్రాక్టర్లు నిలిపి వేశారు. అయితే పనులు ఆగిపోయాయనే అపవాదు రాకుండా కొద్దిపాటి వాహనాలతో ప్రాజెక్టుకు అవసరమైన మట్టిని తరలించడం, ఆ మట్టిని చదును చేసే పనులు చేస్తున్నారు. కట్టకు సంబంధించి రివిట్‌మెంట్ కొంతదూరం చేసి పనులు నిలుపుదల చేశారు. గట్టు ఎత్తిపోతల పనులు నిదానంగా జరగడానికి గల కారణాలు ఆరా తీస్తే రూ.85 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని డీజిల్ కోసం కూడా అప్పు చేసే పరిస్థితి ఉండడంతో కొన్ని వాహనాలతో మాత్రమే పని చేయిస్తున్నట్లు తెలిసింది. బిల్లులు జాప్యం లేకుండా చెల్లిస్తే పనులు వేగవంతం చేసి మరో ఏడాదిలో పనులు పూర్తి చేసే విధంగా ముందుకు సాగే అవకాశం ఉంది.



గట్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న రిజర్వాయర్ కరకట్ట పనులు